క్లుప్తంగా

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న ఎం.నరసింహ

కాచిగూడ: రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లోని పీహెచ్‌సీ, యూపీఎస్‌సీ, ఆర్‌బీఎస్‌కేలలో పని చేస్తున్న రెండో ఏఎన్‌ఎంల అందరినీ భేషరతుగా రెగ్యులర్ చేయాలని లేని యెడల ఈనెల 16 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హిమాయత్‌నగర్ ఏఐటియూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం యూనియన్ అధ్యక్షురాలు వనజ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సెకండ్ ఏఎన్‌ఎంల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, తోట రామాంజనేయులు, ఎం .రామ్మోహన్ తదితరులున్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మల్లులక్ష్మి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాలికలు అన్ని రంగాల్లో ముందుండి దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లులక్ష్మి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో వీరనారి ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బాలబాలికలకు వ్యాసరచన, తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేడు అనేక చట్టాలు ఉన్నప్పటికీ మహిళలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం చేసే చట్టాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని కోరారు. ఐద్వా రాష్ట్ర నాయకులు హైమావతి, కే.ఎన్.ఆశలత, ఉదయలక్ష్మి, రుక్మిణి, సమత, కవిత, సరళ తదితరులున్నారు.

‘కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం’



కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు

ముషీరాబాద్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ముషీరాబాద్ శివాలయం చౌరస్తా వద్ద పార్టీ సీనియర్ నాయకులు పట్నం నాగభూషణంగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డివిజన్ పార్టీ కాంగ్రెస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం కుటుంబ పాలనగా మారిపోయిందని ఆరోపించారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చేసి ప్రజలపై పన్నుల భారాన్ని మోపారని విమర్శించారు. ప్రతి డివిజన్‌లో పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేసి కార్యకర్తలకు, అందుబాటులో ఉండేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌యాదవ్‌ను పట్నం నాగభూషణంగౌడ్ ఘనంగా సన్మానించారు. ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనా యాదవ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్, అంజియాదవ్, జెలిజె శ్రీనివాస్‌యాదవ్, లింగంగుప్తా, పీటర్, మురళీమోజెస్, జాఫర్, బాబుయాదవ్ ఉన్నారు.

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి



పాస్‌బుక్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో తమ సత్తా చాటాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతీనగర్ గంగపుత్ర సంఘం సభ్యులకు ఆయన పాస్‌బుక్‌లను అందజేశారు. సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గంగపుత్ర సొసైటీ సభ్యులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నాగుల ప్రకాశ్ మాట్లాడుతూ.. సొసైటీ ద్వారా సభ్యులకు ప్రభుత్వ సంక్షేమపథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. చిక్కడపల్లి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుండు జగదీశ్‌బాబు, బీఆర్ఎస్ నేత ముఠా జైసింహ తదితరులున్నారు.

రూ.1.50 కోట్లతో థీమ్‌పార్కు ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బర్కత్‌పుర హౌసింగ్‌బోర్డు కాలనీలో రూ.1.50 కోట్లతో ఏర్పాటు చేసిన థీమ్ పార్కును కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఖాళీ స్థలాలను పరిరక్షిస్తూ.. ఒక్కోచోట ఒక్కో థీమ్‌తో ఆహ్లాదకరంగా ఉద్యానవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు.

చిన్నారులకు ఉపయోగపడేలా..

- మహిళలు, చిన్నారులకు చక్కగా ఉపయోగపడేలా అన్ని రకాల ఆటవస్తువులతో పాటు, ఓపెన్ జిమ్ అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఆరోగ్యంపై ప్రజల్లో పెరిగిన అవగాహనను దృష్టిలో ఉంచుకుని నడక, వ్యాయామానికి ప్రతి పార్కులో పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు.
- నియోజకవర్గంలో ఇప్పటికే థీమ్ పార్కులతో పాటు అన్ని రకాల క్రీడలకు కావాల్సిన మైదానాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రత్యేక ఆకర్షణగా థీమ్ పార్కు..

- ఆహ్లాదకరమైన వాతావరణంలో అందరినీ ఆకట్టుకునేలా ప్రత్యేక ఆకర్షణతో థీమ్ పార్కును తీర్చిదిద్దారు. చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా క్రీడా ప్రాంగణం, మహిళలు, పురుషులకు వేర్వేరుగా వ్యాయామం చేసుకునేందుకు వీలుగా సౌకర్యం, వాకింగ్‌జోన్, రన్నింగ్ ట్రాక్, గజిబో షెడ్స్, వినాయక మండపం షెటిల్ కోర్టు తదితర సౌకర్యాలను పార్కులో ఏర్పాటు చేశామన్నారు.
- రాత్రి సమయాల్లో పార్కుల్లో లైటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ప్రణాళికబద్ధంగా ప్రగతి..

- నియోజకవర్గంలో కాచిగూడ డివిజన్ అభివృద్ధి పథంలో ముందుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. డివిజన్‌లో కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు.
- మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, తాగునీటి వసతితో పాటు నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు.
- ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచిస్తున్నామన్నారు. అన్ని కాలనీలు, బస్తీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. దిడ్డి రాంబాబు, ఉష, లక్ష్మణ్ రావు, శేషునారాయణ, ఎం.రాంరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్.కల్యాణ్, శివప్రకాష్, రాములు, ఎస్.సతీష్, స్థానిక నేతలు ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ శిరీష ఓంప్రకాష్‌యాదవ్, కె.సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, దేవిరెడ్డి విజితారెడ్డి తదితరులున్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు..



బుర్జుగల్లీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: నియోజకవర్గంలో పైప్‌లైన్ వ్యవస్థ ఆధునీకరణకు దశలవారీగా చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ బుర్జుగల్లీలో రూ.21 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పైప్‌లైన్ వ్యవస్థను ఆధునీకరించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి గల్లీలో జనాభా ప్రాతిపదికన తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థను కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. పైప్‌లైన్ వ్యవస్థతో పాటు రోడ్లు, పార్కులు వంటి మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. జలమండలి అధికారులు, స్థానిక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలి



ముగింపు కార్యక్రమంలో పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతిస్వామి

కాచిగూడ: యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేసి ధార్మిక భావాలను పెంపొందించుకోవాలని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతిస్వామి అన్నారు. అనిరుధ్ కులకర్ణిచే కాచిగూడ తుల్జాభవన్‌లో ఆదివారం జరిగిన శుక్ల యజుర్వేద ‘కాణ్వశాఖ’ అఖండ ఘనపాఠ వేద పారాయణం ముగింపులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమాజంలో ధార్మిక భావనలు పెంపొందించేందుకు అనిరుధ్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. యువత పాశ్చాత్య పోకడలకు బానిసలు కాకుండా భారతీయ సంస్కృతిని అలవర్చుకోవాలన్నారు. దైహికబలం, మానసికబలం, ఆధ్యాత్మిక బలం ఈ మూడింటి ద్వారా పరిపూర్ణత్వం సాధ్యమవుతుందన్నారు. దైవచింతన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. బ్రహ్మశ్రీ గిరీష్ కులకర్ణి, కమలానంద భారతీస్వామి, సురేష్ ఆత్మారాం మహరాజ్, అతిథి మహరాజ్, కమలేష్ దాస్ స్వామీజీ, కె.గీతామూర్తి, భీమ్‌సేన్ మూర్తి తదితరులున్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెరుల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ టి.సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1977లో వడ్డెరలను సిటీ యాక్టు నుంచి తొలగించడంతో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వడ్డెరలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. మైనింగ్ జోన్‌గా ఏర్పాటు చేసిన బండార విరియాల అబ్దుల్లాపూర్‌మెట్ మండలం రంగారెడ్డి జిల్లాలో 66 ఎకరాలు వడ్డెరులకు కేటాయించారన్నారు. ఎస్ఎండీసీల ద్వారా జాయింట్ వెంచర్‌గా ఇసుక క్లషర్లను ఏర్పాటు చేయాలని కోరారు. వడ్డెరుల వృత్తికి ముఖ్యమైన లారీలు, టిప్పర్లు, జేసీబీలు ఇతర వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇవ్వాలన్నారు. ఎత్తరి అంతయ్య, ట్రస్ట్ రాష్ట్ర నాయకుడు మక్కలి పెంటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ టీచర్ల బదిలీల్లో ప్రత్యేక పాయింట్లను రద్దు చేయాలి



ఇందిరాపార్కు వద్ద ధర్నాలో ఉపాధ్యాయులు

ముషీరాబాద్: స్పౌజ్ టీచర్లకు బదిలీల కౌన్సెలింగ్‌లో ప్రత్యేకమైన పదిపాయింట్లను రద్దు చేసి కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలంగాణ నాన్ స్పౌజ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోకల శేఖర్, ఎం.సక్కుబాయిలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విధానంతో అనేకమంది ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందన్నారు. పది పాయింట్ల నిబంధనల వల్ల రాష్ట్రంలో 70 వేల మంది ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లకు అడ్డంకిగా మారాయన్నారు. స్పౌజ్ టీచర్లకు బదిలీల కౌన్సెలింగ్‌లో ప్రత్యేకమైన పదిపాయింట్లను రద్దుచేసి కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ నాన్ స్పౌజ్ టీచర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో ఉన్నప్పుడు 1999లో మానవతాదృక్పథం అనే కోణంలో జీవోను తీసుకొచ్చి బదిలీల్లో స్పౌజ్ టీచర్లకు ప్రత్యేక పాయింట్లను కేటాయిస్తూ.. గత 25 ఏళ్ల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పదిపాయింట్లను రద్దుచేసి తమ కుటుంబాలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి న్యాయం చేయడానికి బదిలీల కౌన్సిలింగ్‌లో స్పౌజ్–నాన్ స్పౌజ్‌లకు ఒకే విధమైన పాయింట్లు కేటాయించి టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌లను త్వరగా చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం చేస్తామన్నారు. అసోసియేషన్ నేతలు మధుసూదన్, మహేష్‌కుమార్, కృష్ణకుమారి, రూపారాణి, జగదీష్‌కుమార్, శంకర్, ప్రసన్న, భారతి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడు వేల మందికి ‘గృహలక్ష్మి’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకానికి నియోజకవర్గం నుంచి మూడు వేలమంది లబ్ధిదారులకు అవకాశం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రకటించారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వంద గజాలు, అంతకంటే తక్కువ ఉన్న పట్టాదారులకు గృహలక్ష్మి ద్వారా ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనేలా ప్రజలకు ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. దరఖాస్తులను డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులకు అందజేసి 19వ తేదీలోపు గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

300 మందికి బీసీ బంధు..

- బీసీ వర్గానికి చెందిన 14 మంది కుల వృత్తిదారులకు ఒకొక్కరికి లక్ష రూపాయల చొప్పున బీసీ కార్పొరేషన్ ద్వారా త్వరలో అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 300 మందికి ఈ పథకం ద్వారా లక్ష రూపాయల నగదు మంజూరైనట్లు వివరించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, ముఠా నరేష్, డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్, మోజెస్, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్యామ్ యాదవ్, రాజేష్, వెంకట్‌ముదిరాజ్, శ్రీధర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులున్నారు.

నియామకం

అంబర్‌పేట: తెలంగాణ యాదవ హక్కుల పోరాట సమితి అంబర్‌పేట నియోజకవర్గం అధ్యక్షుడిగా దాసర్ల దయాకర్‌యాదవ్ నియమితులయ్యారు. ఆదివారం అంబర్‌పేటలో జరిగిన యాదవ సంఘం సమావేశంలో పోరాట సమితి జాతీయ సమితి అధ్యక్షుడు మేకల రాములుయాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు శెట్టివంశి మోహన్‌యాదవ్‌లు ఆయనకు నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దయాకర్‌యాదవ్ మాట్లాడుతూ.. యాదవ సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పోరాట సమితి నాయకులు రామారావుయాదవ్, మల్లేష్‌యాదవ్, మల్లికార్జున్‌యాదవ్, శ్రీనివాస్, కిరణ్ తదితరులున్నారు.

డాక్టర్ పద్మజకు కోవిడ్-19 ప్రశంసా పత్రం



గవర్నర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న దృశ్యం

నల్లకుంట: ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని కోవిడ్–19 సమయంలో రోగులకు విశేష సేవలందించిన పలువురు ఆదివాసీ వైద్యులకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆదివాసీ మహిళా చైతన్యశక్తి అధ్యక్షురాలు, జీహెచ్‌ఎంసీ అడిషనల్ డైరెక్టర్ అండ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్, నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి పూర్వ సీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ కె.పద్మజ గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

ఏకం సనాతన్ భారత్‌దళ్ ఆవిర్భావ సమావేశం

ముషీరాబాద్: చట్టసభల్లో హిందూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే వారు కరువైయ్యారని ఏకం సనాతన్ భారత్ రాజకీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అంకుర్‌శర్మా ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఏకం సనాతన భారత్ రాజకీయ పార్టీని విస్తరించేందుకు ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. ఆదివారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని జగదీష్ మందిర్‌లో ఆ పార్టీ ఆవిర్భావ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజీవ్, నరేంద్రకుమార్, అమృత్‌పటేల్, నవోదయ కాంత్ హాజరయ్యారు.

అన్నదానం

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం అడిక్‌మెట్ డివిజన్ మేడిబావి బస్తీలోని నల్లపోచమ్మ దేవాలయం అమ్మవారి ఒడిబియ్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్, ముఠా జైసింహ, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు. అశోక్, ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగ్, నాయకులు ఎల్లయ్య, జహంగీర్, శంకర్, కనకయ్య, ప్రభాకర్ బీఆర్ఎస్ నాయకులు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, వై.శ్రీనివాస్, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి, మాధవ్, చిట్టి, శివముదిరాజ్, అస్లాం తదితరులున్నారు.

ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ కత్తి వెంకటస్వామి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ఉన్న మూడు లక్షలకు పైగా ఉన్న ఖాళీ ఉద్యోగాలకు ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలంగాణ లెక్చరర్ల ఫోరం చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ లెక్చరర్ల ఫోరం(టీఎల్ఎఫ్) ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు 12 నెలల వేతనాలు చెల్లించడంతో పాటు వారికి ఉద్యోగభద్రత కల్పించి ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కాంట్రాక్టు లెక్చరర్లను పర్మినెంట్ చేయడం హర్షనీయమన్నారు. టీఎల్ఎఫ్ అసోసియేట్ ప్రెసిడెంట్ కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి వేణు, రాష్ట్ర కార్యదర్శి కె.అశోక్‌గౌడ్, డాక్టర్ సజ్జత్, ఎస్.నాగార్జున, హైదరాబాద్ జిల్లా ప్రెసిడెంట్ ఎం.డీ.షాహీద్, ప్రధాన కార్యదర్శి మహేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గంగపురం ఆంజనేయులు, నాయకులు సదానందం, శివరాంరెడ్డి, రవి తదితరులున్నారు.

ఓటరు జాబితా పటిష్టతకు కృషి



నమోదును పరిశీలిస్తున్న డీఎంసీ, బీజేపీ నేతలు

అంబర్‌పేట: నియోజకవర్గంలో ఓటర్ల జాబితా పటిష్టతకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్‌ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారుతిదివాకర్ తెలిపారు. ఆదివారం అంబర్‌పేట డివిజన్ దుర్గానగర్‌లో ఓటరునమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. బస్తీల్లో సైతం అర్హులైన ఓటర్లను ఓటు జాబితాలో చేర్చడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఓటరు జాబితా నమోదు ప్రక్రియలో ఉన్న ఇబ్బందులను స్థానిక బీజేపీనేతలు ఈ సందర్భంగా డీఎంసీ దృష్టికి తీసుకెళ్లారు. అద్దె ఇంట్లో ఉండి వెళ్లిపోయినవారు, చనిపోయినవారి పేర్లు సైతం ఓటరు జాబితాలో ఉన్నాయని, సొంత ఇల్లు ఉండి పలు ఇబ్బందులు ఉన్నాయన్నారు. సమగ్రంగా తనిఖీలు చేసి పటిష్టమైన ఓటరు జాబితాను రూపొందించాలని కోరారు.

భట్రాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: రాష్ట్రంలో అన్నివర్గాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం అంబర్‌పేట ప్రధాన రోడ్డు త్రిశూల్ కన్వెన్షన్‌లో భట్రాజ్ కుల సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భట్రాజ్ కుల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం కోకాపేటలో 20 గుంటల స్థలం రూ.50 లక్షల నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీసీ కులాలకు సీఎం కేసీఆర్ పెద్ద మనుస్సుతో ఆత్మగౌరవ భవనాలు, వాటి నిర్మాణానికి నిధులు కేటాయించారన్నారు. భట్రాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరాజు విష్ణువర్ధన్‌రాజు, ప్రధాన కార్యదర్శి. పి.పూర్ణచందర్‌రాజు, రాష్ట్ర నాయకులు సాగర్‌రాజు, హేమలత, నగర అధ్యక్షుడు అంబటి బాసిరాజు, ప్రధాన కార్యదర్శి జొన్నగడ్డల మూర్తిరాజు, ఉపాధ్యక్షులు నరసరాజు తదితరులున్నారు.

మార్షల్‌ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



కాచిగూడ: హిమాయత్‌నగర్ డివిజన్ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్‌స్కూల్ ప్రాంగణంలో సామురాయ్ ప్రొఫెషనల్ కరాటే ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ జరిగింది. ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, కలర్‌బెల్ట్‌లను సామురాయ్ ప్రొఫెషనల్ కరాటే డైరెక్టర్ సెన్‌సాయి సిద్దార్థ్‌షా ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు చిన్నతనంలోనే కరాటేలో శిక్షణ ఇప్పిస్తే భవిష్యత్తులో క్రమశిక్షణ గల ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. సీనియర్ కరాటే మాస్టర్స్ నాగరాజు, గ్రాండ్ మాస్టర్ ఆర్‌కే. క్రిష్ణ, మాస్టర్ సుబ్బు తదితరులున్నారు.

17న రవాణారంగ కార్మికుల సదస్సు

కాచిగూడ: రవాణారంగ కార్మికుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి వేలాదిమంది కార్మికులతో ఆగస్టు 17న రవాణారంగా కార్మికుల మహా సదస్సును బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ వెంకటేశం తెలిపారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో జరిగిన జేఏసీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పదేళ్ల నుంచి రవాణారంగ కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అసంఘటిత కార్మికులుగా ఉన్న వీరికి సామాజిక భద్రత, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందడం లేదన్నారు. ప్రభుత్వం ముందుగా రవాణారంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. సంతోష్, కిరణ్, జనార్దన్, మొయిజ్, చంద్రకిరణ్ తదితరులున్నారు.

పద్మశాలీ సభకు తరలిన నేతలు

చిక్కడపల్లి: రాజ్యాధికార సాధన కోసం కోరుట్లలో నిర్వహించిన పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి సభకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి భారీగా నేతలు తరలివెళ్లారు. ఆదివారం జరిగిన ఈ సభలో బీజేపీ నగర యువనాయకులు ఎ.వినయ్‌కుమార్, సంఘం అధ్యక్షుడు రమ శ్రీనివాస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు సుదీష్, సింగిశెట్టి జగదీశ్, గుర్రం శంకర్, సత్యనారాయణ, ఆనంద్, శ్రీను, సంజీవ్‌కుమార్, బొట్టు శ్రీనులు బహిరంగ సభ వేదికపై నుంచి అభివాదం చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల దేశభక్తి గీతాలు



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు



మిల్లెట్స్‌తో జాతీయ పతాకం

నల్లకుంట: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నల్లకుంటలోని సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులకు దేశభక్తి గీతాల్లో శిక్షణ ఇచ్చారు. ఆదివారం బాగ్ అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా మందిరంలో ఆలియా రేడియో, టీవీ కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో చిన్నారులు వివిధ భాషల్లో ఆలపించిన దేశ భక్తిగీతాల రికార్డింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి స్వాతంత్ర్య సమర యోధుల గురించి చిన్నారులకు వివరించారు. మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి మాట్లాడుతూ.. చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు దేశభక్తి గీతాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు వీడియో రికార్డింగ్ చేస్తున్నామన్నారు. ఈవెంట్ మేనేజర్లుగా నందిని, యామిని వ్యవహరిస్తున్నారు.

చిక్కడపల్లి: రాగ్‌షైన్ ఆర్ట్స్ అకాడమీ, ఇమయం ఆర్ట్స్ ఆఫ్ మ్యూజిక్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు త్యాగరాయగానసభలో ఘనంగా జరిగాయి. దేశ గొప్పతనం, చరిత్ర, ఖ్యాతిని పెంచేలా పాటలు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిర్వాహకులు రంజని రాగ, శంకర్‌రామన్‌లు దేశభక్తి పాటలు పాడారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ సంస్థ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, బోర్డు సభ్యులు ఈశ్వరయ్య అతిథులుగా పాల్గొని చిన్నారులను అభినందించారు.

విభిన్నంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..

ముషీరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని విభిన్నంగా నిర్వహించుకోవడానికి ముషీరాబాద్ మహిళలు సిద్ధమవుతున్నారు. ఆదివారం పత్తాని టవర్స్ అసోసియేషన్ మిల్లెట్, పప్పు దినుసులను ఉపయోగించి జాతీయజెండా డిజైన్ ద్వారా దేశభక్తిని పెంపొందించేలా పోటీలను నిర్వహించారు.

- ఆగస్టు 15న జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం విజేతలను ప్రకటించి బహుమతులను అందజేయనున్నట్లు ప్రకటించారు.